క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఉద్యోగులు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన సేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ సత్య శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపిక పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో నిర్వాహకులు

పరవాడ: జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వి.వినోద్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాల, పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో పలు క్రీడల్లో గురువారం ఎంపిక పోటీలు నిర్వహించారు. కుస్తీ, తంగాట, ఘట్కా, థాంగ్‌టా, మార్షల్ ఆర్ట్స్ విభాగాల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ అండర్–19 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ యూ–19 ఆర్గనైజింగ్ కార్యదర్శి వీఏ పుష్పలత తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న గొర్లె రామునాయుడు

పెందుర్తి: స్థానిక కైట్స్ స్కిల్స్ సంస్థలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. సంస్థ చైర్మన్, బీజేపీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి గొర్లె రామునాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. పెందుర్తి సీహెచ్‌సీ వైద్యులు రోగులకు బీపీ, షుగర్, ఇతర రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు అందించారు. వైద్యులు రామకృష్ణ దొర, రవికిరణ్, అనిరుధ్ తదితరులు పాల్గొన్నారు.

దైనందిన జీవితంలో నడక ఒక భాగం కావాలి

అగనంపూడి: దైనందిన జీవితంలో నడక ఒక భాగం కావాలని వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గొల్లవిల్లి కనక భవానీ అన్నారు. క్లబ్ సారథ్యంలో నడువు.. నడిపించు కార్యక్రమంలో భాగంగా 20 సంవత్సరాల వయసు వారికి పరుగు పందెం, 60 ఏళ్లు పైబడిన మహిళలకు నడక పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కనక భవానీ మాట్లాడుతూ మహిళలు అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారని, వాటిని అధిగమించడానికి నడక తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఇందిరాదేవి, శశికళ, జయ, అనిల్‌కుమార్, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులివ్వొద్దని వినతి

పెదగంట్యాడ : మండలంలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు పెదగంట్యాడ తహసీల్దార్ అమలకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును కార్పొరేటర్లు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల దుమ్ము ధూళి ఎగసి పడుతోందని, తద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వచ్చే నెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలంతా పాల్గొని దీనిని వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరావు, నమ్మి రమణ, శ్రీను, అప్పలరెడ్డి, కణితి అప్పలరాజు, శ్రీను, వై.అప్పలరాజు, అప్పలరాజు పాల్గొన్నారు.

- గంటల తరబడి కూడళ్లలో బస్సుల కోసం నిరీక్షణ
- బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు
- బస్టాప్ లేని చోట షెల్టర్లు.. చిరువ్యాపారాలకు ఆవాసాలు

ఎండైనా.. వానైనా.. రోడ్డుపైనే పడిగాపులు!



డీఎస్‌ఎన్‌ఎల్‌యూ వద్ద బస్సు కోసం రోడ్డుపై నిరీక్షిస్తున్న మహిళలు

సబ్బవరం మండలంలో ప్రధాన రోడ్లపై బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ జాతీయ విశ్వవిద్యాలయాలు, పలు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు రాకపోకలు సాగించేందుకు బస్సులే చాలా వరకు ఆధారం. బస్టాప్‌ల వద్ద ఆటోల్లో వెళ్లాలన్నా.. చాలాసార్లు రోడ్డుపై ఎదురుచూడాల్సిందే. అయితే ప్రభుత్వంగానీ, ఆర్టీసీ గానీ బస్ షెల్టర్లపై దృష్టిసారించట్లేదు. దీంతో ప్రయాణికులు రోడ్లపైనే పడిగాపులు కాస్తున్నారు.



సబ్బవరం జోడుగుళ్ల జంక్షన్లో బస్సు ఎక్కుతున్న విద్యార్థులు, ప్రయాణికులు

సబ్బవరం:

మండలంలోని గ్రామాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులతో పాటు దైనందిన వ్యవహారాలపై నిత్యం విశాఖ, అనకాపల్లికి అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. జాతీయ విశ్వవిద్యాలయాల రాకతో బస్సుల కోసం రోడ్లపై నిరీక్షించే ప్రయాణికుల తాకిడి మరింత పెరిగింది. అయితే చాలా బస్టాప్‌లలో బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులకు నిలువ నీడ లేని పరిస్థితి. గత ప్రభుత్వంలో పలు చోట్ల బస్ షెల్టర్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదనలు మూలకు చేరాయి.

మూడు జిల్లాలకు ప్రధాన కూడలి

సబ్బవరం మండల కేంద్రం అనకాపల్లి, అల్లూరి జిల్లా ప్రాంతాలకు ప్రధాన ముఖ ద్వారం. విశాఖతో పాటు అనకాపల్లి, విజయనగరం జిల్లాలోని కొత్తవలస వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన జంక్షన్. దీంతో ప్రయాణికుల హడావుడి ఎక్కువగా కనిపిస్తుంది. జాతీయ రహదారిలో పలు బస్టాప్‌లలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్నా.. వారు నిరీక్షించేందుకు బస్ షెల్టర్ల జాడ ఎక్కడా కనిపించట్లేదు. మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్ మినహా మరెక్కడా బస్ షెల్టర్ కనిపించకపోవడంతో ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ఎండావానల్లో ఇబ్బందులు

ప్రస్తుతం ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పరిస్థితి మరీ దారుణంగా మారింది. మహిళలు గంటల తరబడి ప్రధాన రోడ్లపై నిరీక్షించాల్సి వస్తోంది. ఎక్కడా బస్ షెల్టర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండా, వానల సమయంలో నరక యాతన అనుభవిస్తున్నారు.

- మండలంలోని గొటివాడ సమీపంలో ఉన్న దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వద్ద ప్రయాణీకులు, పలు ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల తాకిడి అధికం. ఇక్కడ బస్ షెల్టర్ లేకపోవడంతో గంటల తరబడి ప్రయాణీకులు నడిరోడ్డుపైనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు.



అసకపల్లిలో చిరువ్యాపారాలకు ఆవాసంగా మారిన బస్ షెల్టర్

- పెట్రోలియం, మారిటైం విశ్వవిద్యాలయాలకు వెళ్లే ఆరిపాకలోని టిక్కలిపాలెం జంక్షన్ వద్ద ప్రయాణీకుల రద్దీ ఎక్కువ. ఇక్కడ బస్టాపుల్లో ఎలాంటి షెల్టర్లు లేకపోవడంతో వీరి బాధలు వర్ణనాతీతం.
- సబ్బవరం మూడు రోడ్ల కూడలితో పాటు పలు ప్రధాన కూడళ్లలో ఎక్కడా బస్ షెల్టర్‌లు లేవు. దీంతో ప్రయాణీకులు ఎక్కడ చెట్టునీడ ఉంటే అక్కడే కూర్చుని, బస్సులు వచ్చాక హడావుడిగా వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు.

నిరుపయోగంగా మారి..

మండలంలో పలు చోట్ల గతంలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అసకపల్లి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ చిరు వ్యాపారాలకు నిలయంగా మారింది. గొల్లలపాలెంలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ ప్రస్తుతం నిర్వహణ లేక, అధ్వాన స్థితికి చేరింది. గతంలో రూ.లక్షలు వెచ్చించి, పలు చోట్ల చేపట్టిన బస్ షెల్టర్‌లను నిరుపయోగంగా వదిలేశారు. దీంతో ఆలనాపాలనా చూసే నాథుడు లేక శిథిలావస్థకు చేరుకున్నాయి.

బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి



మా ఊరి నుంచి మండల కేంద్రానికి ఎక్కువగా వెళ్తుంటాం. ఆరిపాక మీదుగా బస్ సౌకర్యం లేని మూడు కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిందే. ఎక్కువగా ఆరిపాక బస్టాప్ వద్ద బస్సు ఎక్కి సబ్బవరం వెళ్తుంటాం. బస్ షెల్టర్ లేకపోవడంతో గంటల తరబడి రోడ్డుపైనే ఉంటాం. అవసరమైన చోట్ల బస్ షెల్టర్‌లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– రాజాన కృష్ణవేణి, నల్లరేగులపాలెం

ఇబ్బందులు పడుతున్నాం



కోటపాడు నుంచి గుల్లేపల్లి మీదుగా విశాఖకు రోజూ బస్సుల్లోనే ప్రయాణం చేస్తాం. మా గ్రామం నుంచి ఇరువైపులకూ ప్రయాణం చేసేవారు బస్టాప్‌లలో గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి. బస్ షెల్టర్‌లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రయాణీకుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని బస్ షెల్టర్‌లను ఏర్పాటు చేయాలి.

– ఉప్పిలి దుర్గారావు, గుల్లేపల్లి

పట్టుదలతో చదివితే ఉన్నతస్థాయి



మాట్లాడుతున్న ఎస్‌ఐ ఎన్‌వీ భాస్కరరావు

పెందుర్తి: క్రమశిక్షణతో నడుచుకుంటూ, పట్టుదలతో చదివితే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని పెందుర్తి లా అండ్ ఆర్డర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ భాస్కరరావు సూచించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేవీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వేపగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై గురువారం అవగాహన కలిగించారు. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా చిత్తశుద్ధితో ప్రయత్నం చేయాలన్నారు. తల్లిదండ్రులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా వారికి వివరించాలన్నారు. మైనర్లు వాహనాలు నడపడం నేరమన్నారు. బాలికలను, మహిళలను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తే కఠినమైన శిక్షలు పడతాయని హెచ్చరించారు. సరదాగా మొదలయ్యే మాదకద్రవ్యాలు, మద్యపానం వంటి అలవాట్లతో జీవితాలు నాశనమవుతాయన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటే సమాజంలో గౌరవం పెరుగుతుందని సూచించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పాఠశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహం



మాట్లాడుతున్న అనకాపల్లి ఇండస్ట్రియల్ ఐపీవో త్రివేణి

సబ్బవరం: యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి ఇండస్ట్రియల్ ఐపీవో త్రివేణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో చిన్న పరిశ్రమల ప్రోత్సాహానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహాయ సహకారాలపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జీరో ఎఫెక్ట్ జీరో డిఫెక్ట్(జెడ్) సర్టిఫికెట్ గురించి వివరించారు.

దీన్ని కేంద్ర ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలకు ఉచితంగా అందిస్తుందన్నారు. కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునే యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలోన్స్ గురించి కూడా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, ఎజెడ్ క్వాలిటీ డెవలప్‌మెంట్ కంపెనీ సీఈవో కాళ్ల జగపతి, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శరగడం సాగర్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎం.గంగరాజు, కార్యదర్శి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి ఎన్టీపీసీ కృషి

- స్టేక్‌హోల్డర్ల సమావేశంలో సంస్థ ఈడీ సమీర్‌శర్మ



స్టేక్ హోల్డర్స్ సమావేశంలో ఈడీ సమీర్‌శర్మతో ప్రజా ప్రతినిధులు, అధికారులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధి తదితర ప్రజోపయోగ కార్యక్రమాల అమలుకు సంస్థ విశేష కృషి చేస్తోందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ తెలిపారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో దీపాంజలినగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఎన్టీపీసీ స్టేక్ హోల్డర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలిక సామాజిక సంక్షేమానికి దోహదపడుతూనే సమాజ అవసరాలను తీర్చే ప్రభావవంతమైన ప్రాజెక్టులను సంస్థ చేపడుతుందన్నారు. సీఎస్సార్ విభాగం ద్వారా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, 2025–26లో చేపట్టనున్న కార్యచరణలో ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారం గురించి మాట్లాడారు.

వాడచీపురుపల్లి సర్పంచ్ శివలంక లక్ష్మి మాట్లాడుతూ వాడచీపురుపల్లి శివారు గ్రామాల్లో అభివృద్ధి పనులతోపాటు, డస్ట్‌బిన్లు మంజూరు చేయాలని కోరారు. నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య వెంకటపతిపాలెం సామాజిక భవనం, నాయుడుపాలెం శ్మశానవాటిక అభివృద్ధి, సీసీ కాలువలు, రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అడిగారు. శిథిలావస్థలో ఉన్న వాడచీపురుపల్లి–పరవాడ రహదారిని అభివృద్ధి చేయాలని పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు కోరారు. పంచాయతీల్లో చెత్తను తరలించేందుకు అవసరమైన వాహనాలను ప్రతి పంచాయతీకి మంజూరు చేయాలని రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు అడిగారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం ఎన్నిక



ఎం.వినోద్‌బాబు, అధ్యక్షుడు

పరవాడ: అనకాపల్లి జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మద్ది వినోద్‌బాబు(పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల), ఉపాధ్యక్షుడిగా కె.శ్రీహరి(కేడీపేట), కార్యదర్శిగా ఎ.శోభ(నర్సీపట్నం), సహాయ కార్యదర్శులుగా డాక్టర్ ఏఆర్‌టీ సుజాత(కోటవురట్ల), ఎల్.సత్యవతి (కొత్తకోట)లు ఎన్నికైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–1 పరిధి 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల్ల భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో సబ్బవరం, ఇరువాడ, పైడివాడ, గొల్లలపాలెం, అమృతపురం, తవ్వవానిపాలెం, బాటజంగాలపాలెం, నారపాడు, నల్లరేగులపాలెం పంచాయతీ పరిధి గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

సింహాచలం: 11కేవీ దారపాలెం, గోశాల, వెంకటరావురం ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ బి.సింహాచలంనాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో కుమ్మరిదిబ్బ, పాత అడవివరం జంక్షన్, దారపాలెం, ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్, బాలాజీనగర్, వెంకటాపురం, ఆర్.ఆర్. వెంకటాపురం, ఎస్సీ, బీసీ కాలనీ, అజంతాపార్క్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

బ్రేక్‌డౌన్ లారీని ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



ప్రమాద స్థలంలో నుజ్జయిన ఆటో, పక్కనే పడివున్న డ్రైవర్ అప్పారావు మృతదేహం

సబ్బవరం: మండలంలోని జాతీయ రహదారి మర్రిపాలెం టోల్‌ప్లాజా వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వెన్నెపూడికి చెందిన దూలిపల్లి అప్పారావు(42) బుధవారం రాత్రి చేగోడీలు, జంతికల లోడుతో కాకినాడ నుంచి విజయనగరం వస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో జాతీయ రహదారిపై మర్రిపాలెం టోల్‌ప్లాజా వద్ద బ్రేక్ డౌన్ అయిన లారీ వెనుక వైపు బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆటో ముందుభాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ అప్పారావు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం తెలుసుకున్న సీఐ రామచంద్రరావు సిబ్బందితో సంఘటన స్థలికి చేరుకుని, ప్రమాద కారణాలను పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను, లారీని అదుపులోకి తీసుకుని, మృతుడి సోదరుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఏటీఎల్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత



అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ప్రిన్సిపాళ్లు, ఇన్‌చార్జ్‌లతో యునిసెఫ్ రాష్ట్ర ప్రతినిధి సుదర్శన్

సింహాచలం: అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్)ల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ దృక్పథం పెరుగుతోందని ఏపీ యునిసెఫ్ కన్సల్టెంట్ సుదర్శన్ తెలిపారు. వేపగుంట జిల్లా పరిషత్ హైస్కూల్లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో జిల్లాలోని 9 ప్రభుత్వ అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ప్రిన్సిపాళ్లు, ఇన్‌చార్జ్‌లతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటీఎల్‌లు విద్యార్థులను భవిష్యత్తులో శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలుగా మారేందుకు ఎంతగానో దోహపడతాయ న్నారు. ఎయిమ్ పోర్టల్ గురించి తెలిపి, నెల వారీ కార్యక్రమాలను వివరించారు. విశాఖ జిల్లా సైన్స్ అధికారి(డీఎస్‌వో) రాజారావు మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి ఒక ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్ రూపొందించి, విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించాలన్నారు. విజ్ఞాన ఆశ్రమ్ ప్రతినిధి రమేష్, విశాఖ సోషల్ వెల్ఫేర్ స్కూల్ డీసీవో రామకృష్ణ, రాంబాబు, హెచ్‌ఎంలు, ఏటీఎల్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

గురుకులం సందర్శన

అడవివరంలోని మహాత్మా జ్యోతీబాపూలే ఏపీ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను యునిసెఫ్ రాష్ట్ర కన్సల్టెంట్ సుదర్శన్ గురువారం సందర్శించారు. పాఠశాల విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులను పరిశీలించారు. వారి ప్రతిభాసామర్థ్యాలను అభినందించారు. ప్రిన్సిపాల్ రమామోహిని, వైస్ ప్రిన్సిపాల్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవత నేస్తాలమ్మ పండగ



నేస్తాలమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం ప్రజల ఇలవేల్పు నేస్తాలమ్మ పండగను ఇరు గ్రామాల ప్రజలు గురువారం భక్తిశ్రద్ధలతో జరిపారు. పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు దంపతులు, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య దంపతులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. భక్తులు ఉదయం 6 గంటల నుంచే ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయం ఎదుట షామియానాలు, మంచినీరు, ఉచిత ప్రసాదం ఏర్పాట్లు ఉత్సవ కమిటీ చేసింది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. రాత్రి డప్పులు, తప్పెట గుళ్లు, చిడతలు, నేలడ్యాన్సులు, సాముగరిడీలతో అమ్మవారిని ఇరు గ్రామాల్లో భారీ ఊరేగింపు జరిపి, బాణసంచా వెలుగుల మధ్య అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు, రేపు దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

పెందుర్తి: ఆన్‌లైన్ దస్తావేజు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు శుక్ర, శనివారాల్లో పెన్‌డౌన్ చేసి నిరసన తెలపనున్నట్లు పెందుర్తి దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు పితాని నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ కార్డు ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి రిజిస్ట్రేషన్లు, కార్డుప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వలన ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సబ్బవరం: స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన పలు విధానాల వల్ల తలెత్తే సమస్యల పరిష్కారం కోరుతూ రెండు రోజులు పెన్‌డౌన్ చేయనున్నట్లు స్థానిక దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.సీతారామమూర్తి తెలిపారు. ఈ మేరకు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ గౌస్య జిలానీ బేగంకు శ్రీదుర్గమాంబ దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. సాఫ్ట్‌వేర్ సాంకేతిక లోపాలు, ఇతర సమస్యలపై ఈ పెన్‌డౌన్ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందన్నారు.



సబ్బవరంలో సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న దస్తావేజు లేఖర్లు

దస్తావేజు లేఖర్ల సంఘం కార్యవర్గం

శ్రీదుర్గమాంబ దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బిక్కవల్లి రామ్మూర్తి, అధ్యక్షుడిగా వల్లభజోస్యల సీతారామమూర్తి, ఉపాధ్యక్షుడిగా జూరెడ్డి శ్రీరాంమూర్తి, ప్రధాన కార్యదర్శిగా శేఖరమంత్రి శ్రీనివాసరావు పట్నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దంతులూరి సురేష్‌వర్మ, జాయింట్ సెక్రటరీగా నరవ రామచంద్రరావు, కోశాధికారిగా జి.శేఖర్, లీగల్ అడ్వయిజర్‌గా బి.సత్యనారాయణను సభ్యులు ఎన్నుకున్నారు.